క్లుప్తంగా

పచ్చదనం కనుమరుగు



ఖాళీగా దర్శనమిస్తున్న కుండీలు

సంగారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రంలో స్థానిక కలెక్టరేట్ నుంచి ఐటీఐ కళాశాల వరకు ఉన్న ఫుట్‌పాత్‌పై స్వచ్ఛ సంగారెడ్డి కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వం కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసి కుండీలు ఏర్పాటు చేసి పెట్టిన మొక్కలు చనిపోయాయి. అధికార యంత్రాంగం సకాలంలో నీరు పోయకపోవడంతో మొక్కలు ఎండిపోయి పచ్చదనం కనుమరుగైంది. ఇప్పటికైనా అధికారులు కుండీలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మేకల రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలను సేకరించిన పవన్‌కుమార్

రాయికోడ్(అందోల్): మండలంలోని ఔరంగా నగర్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల పశువైద్యాధికారి పాండ్యన్ పుర్రువ్యాధి నివారణకు మేకలకు టీకాలు వేశారు. ఈ క్రమంలో డిస్ట్రిక్ యానిమల్ డిసీస్ డయాగ్నొస్టిక్ ల్యాబోరేటరీ ఏడీ పవన్ కుమార్ టీకాలు వేసిన మేకల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ముందస్తుగా ఇచ్చిన టీకాల పనితీరును నిర్ధారించేందుకు రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుపోషకులు, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

వట్‌పల్లి(అందోల్): గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు తీసుకునే పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ అన్నారు. సోమవారం గ్రామ సమైఖ్య సంఘాల అధ్యక్షులు, ఆరోగ్య కమిటీ సభ్యులు, వీఏఏలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం, పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, చేతులు శుభ్రం చేసుకోవడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లలపోషణ 1000 రోజుల ప్రాధాన్యత, రక్తహీనత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, సంగీత, సీసీలు ఈశ్వరయ్య, జనార్దన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించండి



మాట్లాడుతున్న జయరాజు

కల్హేర్(నారాయణఖేడ్): సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అధిక నిధులు కేటాయించి కుడి, ఎడమ కాల్వలు ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని మాసాన్‌పల్లి వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణఖేడ్ వెనుకబడిన ప్రాంతం.. సాగునీరందిస్తే పంటలు పండి అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్, నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు అశోక్, నర్సింలు, ప్రవీణ్, అరుణ్, దత్తు, బాబురావు, ఎల్లయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవం

సంగారెడ్డి: కన్యక పరమేశ్వరీ అమ్మవారి పంచమ వార్షికోత్సవ వేడుకలు సంగారెడ్డిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ,'పుణ్యవచనం, రక్షాబంధనం, మాహాభిషేకం, మాతృకవాస్తు, రుద్రచండీవాహనం, దేవత మూల మంత్ర హోమాలు, పూర్ణాహుతి ఆధ్యాత్మిక కార్యక్రమాలు రోజంతా జరిపారు. వాసవీ మహాసంస్థాన్ అధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కన్నుల పండువగా చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు బంద్

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పరిధి పారిశ్రామికవాడలో మంగళవారం మ. 2 గంటల నుంచి సా.5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ఏఈ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు

- ఈ నెల 20 నుంచి చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే జరిమానా
- ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి
- మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్



సమావేశంలో మాట్లాడుతున్న జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు

నారాయణఖేడ్: వ్యాపారులు రోడ్లపై కూరగాయల వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో కూరగాయల వ్యాపారులు, పారిశుద్ధ్య కార్మికులు, చెత్త తరలింపు వాహనాల సిబ్బందితో సోమవారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూరగాయల వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త తరలింపు ఆటోల్లోనే వేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించాలని, చెత్త తరలింపు వాహనాల సిబ్బందికి సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో పొడిచెత్త, మిగతా రోజుల్లో తడి చెత్తను సేకరించాలన్నారు. మేనేజరు వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తడిపొడి చెత్తపై అవగాహన

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ అధికారులు స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించారు. టౌనంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఫంక్షన్ హాల్‌ల నిర్వాహకులతో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపార సమూహం నందు ఉత్పత్తి అయిన తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనంలో వేయాలన్నారు. ఈ నెల 20 నుంచి తప్పకుండా పాటించాలని, లేనట్లయితే రూ. 500 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకం నిషేధం అమలులో ఉందని, క్యారీ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు లభిస్తే రూ.10 వేల జరిమానా, లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. వ్యాపారులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, ఇంతకు ముందు తీసుకున్న వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్

సారవంతమైన భూములు వదిలేయండి



డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: నిమ్జ్‌కోసం సారవంతమైన భూములను తీసుకోవద్దని న్యాల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల రైతులు సీపీఎం నాయకులతో కలిసి సోమవారం డిప్యూటీ కలెక్టర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి బి.రాంచందర్ మాట్లాడుతూ.. నిమ్జ్ ప్రాజెక్టు కోసం చేపడుతున్న భూసేకరణ సరిగ్గా లేదన్నారు. మూడు పంటలు పండే సారవంతమైన భూములను ఇవ్వమని రైతులు చెబుతున్నా భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతుల నుంచి భూసేకరణ చేపట్టాలని, సారవంతమైన భూములకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. బలవంతం చేస్తే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు నారాయణరావు అనిల్‌కుమార్, ప్రభాకర్, గుండారెడ్డి, రాజేష్, శంకర్ ఉన్నారు.

సీఐటీయూతోనే కార్మికుల సంక్షేమం



పర్మినెంట్ లెటర్లను అందజేసిన నాయకులు

పటాన్‌చెరు టౌన్: మండలం పరిధి పాశమైలారం పారిశ్రామికవాడలోని కిర్బి పరిశ్రమ హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ రాజమహేందర్, సీఐటీయూ జిల్లా కోశాధికారి, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజయ్య 69 మంది కార్మికులకు పర్మినెంట్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. కిర్బి పరిశ్రమలో సీఐటీయూ వచ్చిన తర్వాతనే రెండు దఫాలుగా కొత్తగా కార్మికులను పర్మినెంట్ చేశారని తెలిపారు. గత అగ్రిమెంటు ప్రకారం కార్మికులందరికీ లెటర్లు ఇచ్చామని, సీఐటీయూ ఉన్నచోట మాత్రమే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ రాజు, యూనియన్ నాయకులు శ్రీనివాస్, నాగప్రసాద్, బిలాల్, మహేశ్వర్‌రెడ్డి, సోమన్న పాల్గొన్నారు.

సంప్రదాయ పద్ధతిలో ఎదుర్కోలు



ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ మహీంద్రకాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఎదుర్కోలు కార్యక్రమాన్ని సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన అర్చకులు రాఘవచార్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రీవారి శాంతి కల్యాణం, స్వామి శేషవాహనం ఊరేగింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, కార్యదర్శి రాజేష్, సభ్యులు ఉమామహేశ్వర్‌రావు, జ్ఞానారెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధల విగ్రహాల ప్రతిష్ఠాపన

ఝరాసంగం(జహీరాబాద్): దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని మాచ్నూర్ గ్రామ శివారులోని రామలింగేశ్వర ఆలయ ఆవరణలో సుప్రభాత సేవ, దేవీ దేవత రుద్రహవనం, రుద్రాభిషేకం, హోమం పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి మహంత్ సిద్దేశ్వరానందగిరి మహరాజ్, ధనసిరి మఠం పీఠాధిపతి వీరేశ్వర శివాచార్య చేతుల మీదుగా విగ్రహ ప్రాణ:ప్రతిష్ఠ వైదిక క్రతువు నిర్వహించారు. ఆలయంలో భక్తులు అన్నదాన కార్యక్రమ నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలు అందించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం..ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 33 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 19 మందికి రూ. 2 వేలు, 14 మందికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంగారెడ్డిలో తొమ్మిది మందికి..

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. ఆదివారం తనిఖీల్లో తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఆరుగురుకి రూ. 2000, మరొకరికి రూ.1500, మిగతా ఇద్దరికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌పోలీసులు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ నేతృత్వంలో కూల్చివేతలు చేపట్టారు. సోమవారం ఇదివరకే నోటీసులు ఇచ్చినా స్పందించిన వారిపై చర్యలకు దిగినట్లు తెలిపారు. మున్సిపాలిటీ నుంచి నిబంధనల మేరకు అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేయాలని సూచించారు.

ఉపాధ్యాయుల నియామకం

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో 11 మంది కాంట్రాక్టు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు(ఎస్‌జీటీ) విధుల్లో చేరినట్లు ఎంఈఓ రహీమొద్దీన్ తెలిపారు. 2008 డీఎస్సీలో అనుబంధ జీఓ 28తో నష్టపోయిన బీఎడ్ అభ్యర్థులకు నియామకాలు చేసినట్లు తెలిపారు. న్యాయపరమైన కారణాలతో ఆగిపోయిన నియామకాల్లో జిల్లాకు చెందిన 70 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. వీరికి రూ.31,040 నెలసరి వేతనంతో కాంట్రాక్టు పద్ధతిన ప్రభుత్వం నియామకాలు చేపట్టింది. కోర్టు ఉత్తర్వులకు తోడు గతంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తాము ఉద్యోగాలు పొందినట్లు కాంట్రాక్టు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యార్థులకు కంటి పరీక్షలు

నారాయణఖేడ్: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో సోమవారం నుంచి విద్యార్థులకు కంటి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 50 మందికి నేత్ర వైద్య సహాయకులు కంటి పరీక్షలు నిర్వహించగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రమేష్ పర్యవేక్షించారు. ఖేడ్‌లో 653 మంది విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గతంలో తేలగా వారికి మళ్లీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజుకు 50 మందికి చొప్పున వచ్చేనెల 15వ తేదీ వరకు కంటి పరీక్షలను నిర్వహిస్తామని డా.రమేష్ వివరించారు.

◆ నేడు వాహనాల వేలం

నారాయణఖేడ్: వివిధ కేసుల్లో సీజ్ చేసిన నాలుగు బైక్‌లను నేడు (మంగళవారం) ఉ.11గంటలకు ఖేడ్ ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. నిర్ణీత సొమ్మును డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని చెప్పారు. పూర్తి వివరాల కోసం 8712658915 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

◆ మాజీ కౌన్సిలర్‌కు సన్మానం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ 13వ వార్డు మాజీ కౌన్సిలర్ లావణ్యను మల్లారెడ్డి కాలనీవాసులు సన్మానించారు. ఇచ్చిన హామీ ప్రకారం అభివృద్ధి పనులు చేశారని అన్నారు. ఆమెతో పాటు ఆమె భర్త, కాంగ్రెస్ నేత శశిధర్‌రెడ్డిలను కాలనీవాసులు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

◆ ఆలయాల నిర్మాణానికి సహకారం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): నూతన ఆలయాల నిర్మాణాలకు తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మలన్నస్వామి, శివాలయంలో విగ్రహ ప్రతిష్టాపన, తెల్లాపూర్‌లో బీరప్ప, మల్లన్నస్వామి ఆలయంలో నిర్వహించిన విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. కార క్రమంలో మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు బాలాజీ, ఉమేష్, బుచ్చిరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

◆ 'పది' విద్యార్థుల దత్తత

కంగ్టి(నారాయణఖేడ్): పది విద్యార్థులకు వచ్చే నెల 23 నుంచి వార్షిక పరీక్షలు ఉండటంతో ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకోవాలని సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. సోమవారం ఎంపీడీఓ ప్రత్యేక తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 107 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలోని 17 మంది ఉపాధ్యాయులు 6గురు విద్యార్థుల చొప్పున దత్తత తీసుకొని 100 శాతం ఉత్తీర్ణతకు సంసిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

◆ కార్మికులకు యూనిఫాం అందజేత

కంగ్టి(నారాయణఖేడ్): పారిశుద్ధ్య కార్మికులు, నీటి సరఫరా ఉద్యోగులకు యూనిఫాం, గుర్తింపు కార్డులు అందజేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించేవారికి అందజేస్తున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. తడ్కల్ గ్రామ పంచాయతీలో అందజేసినట్లు తెలిపారు.

◆ విద్యార్థినులకు ట్రాన్స్‌ఫరబుల్ శిక్షణ

సదాశివపేట(సంగారెడ్డి): ఉద్యోగాలు సాధించేందుకు విద్యార్థినులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బంగ్లా భారతి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహింద్ర ప్రైడ్ వారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఏడు రోజుల పాటు ట్రాన్స్‌ఫరబుల్ స్కిల్స్ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టెక్నాలజీ రోజురోజుకు మారుతుందని మారిన సాంకేతిక పరిజ్ఞానికి సరిపడ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

వేతనాలు చెల్లించాలని కార్మికుల ధర్నా



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

జోగిపేట(అందోల్): జోగిపేట ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మూడు మాసాలుగా వేతనాలు చెల్లించకపోవడంతో సోమవారం విధులు బహిష్కరించిన ఏరియా ఆస్పత్రి ఆవరణలో ధర్నాకు దిగారు. కార్మికులకు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలుగా జీతాలు చెల్లించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జీఓ 60 ప్రకారం ప్రతి నెల 5వ తేదీ వరకు జీతాలు జమ చేయాలన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ సౌజన్య కార్మికులకు నచ్చజెప్పడంతో ధర్నాను విరమించారు. కార్మికులు సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు బి.మల్లేశం, సురేష్, మల్లేశం, శ్రావణ్, హరి, శేఖర్, భాగమ్మ, లక్ష్మి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై మల్లన్నస్వామి దీవెనలు ఉండాలి

కాంగ్రెస్ నేత నీలం మధు



నీలం మధును సన్మానిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: మల్లన్నస్వామి దీవెనలు ప్రజలపై ఉండాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం హత్నూర మండలంలోని పన్యాల గ్రామంలో నిర్వహిస్తున్న మల్లన్నస్వామి జాతర మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాజిరెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు సన్మానించారు. నీలం మాట్లాడుతూ.. జాతరలు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు ప్రజలంతా ఐక్యమత్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో హత్నూర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణ, మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హకీమ్, ఆంజనేయులు, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలారెడ్డి

సంగారెడ్డి జోన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి కోరారు. సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, పీసీసీ కార్యదర్శి ఆంజనేయులు నాయకులు బొంగుల రవి, కూన సంతోష్ హఫీజ్ షేక్ షఫీ, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై ప్రచారం చేయాలి

సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ



పోలీసులు, న్యాయవాదులతో సమావేశమైన జడ్జి

జహీరాబాద్: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విస్తృత ప్రచారం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి కె.సూరికృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలను బాధితులకు, కక్షిదారులకు తెలియజేయాలన్నారు. రాజీమార్గంతో కేసులు సత్వర పరిష్కారం చేసుకునేలా చూడాలని తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



జహీరాబాద్ టౌన్: అల్గోల్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకల్లో కేక్‌కట్ చేసి తినిపిస్తున్న నరోత్తం



సదాశివపేట : రోగులకు పండ్లు పంపిణీ

శుభాకాంక్షల వెల్లువ

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 71వ పుట్టినరోజు వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు రక్తదాన శిబిరాలు, రోగులకు పండ్ల పంపిణీ, కేక్ కట్టింగులు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉన్నంత వరకు కేసీఆర్ పేరు స్థిరస్థాయిగా ఉంటుందన్నారు.. కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందారని అన్నారు.



నారాయణఖేడ్: రక్తదాన శిబిరం



జహీరాబాద్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



పటాన్‌చెరు: మొక్క నాటుతున్న నాయకులు



రామచంద్రాపురం: ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సింధు రెడ్డి

భూవిక్రయంలో మోసం.. ఇద్దరిపై కేసు

కల్హేర్(నారాయణఖేడ్): భూమిని తప్పుగా చూపించి విక్రయించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. సిర్గాపూర్ మండలం వంగ్దల్ శివారులో సర్వే నంబరు 41/అ 3.30 ఎకరాలు భూమి హైదరాబాద్‌కు చెందిన రాధాకృష్ణ కొనుగోలు చేశాడు. సంబంధిత పట్టదారు బనోత్ లక్ష్మన్, మధ్యవర్తి నిజాంపేట్ మండలం నగధర్ తండాకు చెందిన ప్రేమ్‌సింగ్ రోడ్డు పక్కన ఉన్న భూమి చూపి తమదేనని నమ్మించారు. రాధాకృష్ణ రూ.51 లక్షలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేశాక రాధాకృష్ణ అక్కడి వెళ్లాడు. అసలు పట్టాదారు వచ్చి రోడ్డు పక్కన భూమి తమదని తెలిపాడు. దీంతో రాధాకృష్ణ తాను మోసపోయినట్లు గుర్తించి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.